TGTEL/26/A5513

వార్తా దీపిక

ప్రచురణ :సంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 60 | 29 గురువారం అక్టోబర్ 2026 | వెల: 02 | పేజీలు:04

టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు

- మోదీ, అమిత్ షాలపై రాహుల్ గాంధీ ఫైర్
- మోదీ, అమిత్ షాలపై తీవ్ర విమర్శలు
- భయంతోనే వ్యాపారవేత్తలు మౌనంగా ఉన్నారని ఆరోపణ

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ టాటా గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేశారు. టాటా సంస్థను 'నేరపూ రితంగా నాశనం' చేస్తున్నారని, అయినా దేశం లోని వ్యాపారవేత్తలు భయంతో మీకు ధైర్యం లేదు, మాకుంది. ఈ నేరాలకు న్యాయం జరిగేలా చూస్తాం" అని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు.టాటా గ్రూప్‌లో కొంతకాలంగా నడుస్తున్న అంతర్గత వివాదం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సం తరించుకున్నాయి.

...మిగతా 2 లో...

తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం..

సాయానికి సిద్ధమన్న భట్టి

ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ చేసిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



- ఉత్తరాంధ్రను అతలాకుతలం చేసిన అర్నబ్ తుపాను
- విపత్తులో ఏపీకి సాయం చేసేందుకు ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వం
- విద్యుత్ పునరుద్ధరణ పనులకు సిబ్బంది, సామగ్రి పంపుతామని హామీ
- తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి గొట్టిపాటి

ఇప్పటికే సహాయక చర్యల కోసం 6,000 మంది సిబ్బందిని మోహరించిన ఏపీ ప్రభుత్వం అర్నబ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు, ముఖ్యంగా విద్యుత్ పునరుద్ధరణ పనులకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు.తుపాను తీవ్రత, ఏపీలో జరిగిన నష్టం గురించి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో నష్టాన్ని తగ్గించడానికి, వీలైనంత త్వరగా పరిస్థితులను సాధారణ స్థితికి తీసుకురావడానికి చేపడుతున్న చర్యలను మంత్రి గొట్టిపాటి ఆయనకు వివరించారు. ముఖ్యంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, ప్రజల భద్రత కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి తెలిపారు.

...మిగతా 2 లో...

బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు.. కాంగ్రెస్ ఖాతా తెరిచిందా?:

మోదీ సెటైర్...

- నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు
- ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతో జరిగాయని గుర్తుచేసిన ప్రధాని మోదీ
- 12 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్
- కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కని వైనం
- మోనోకిల్ ఎమోజీతో కాంగ్రెస్‌పై మోదీ సెటైర్



నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క స్థానాన్నీ గెలుచుకోలేక పోయింది. ఈ ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యంగా స్పందించారు. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిగాయని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ ఎన్ని స్థానాలు గెలిచిందో ఊహించాలంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి 'మోనోకిల్' ఎమోజీని జతచేశారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక రాష్ట్రాల్లో మొత్తం 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ 12 స్థానాల్లో పోటీ చేసింది. గతంలో ఆ పార్టీ గెలిచిన నాలుగు స్థానాలు కూడా ఈ ఎన్నికల్లో ఉన్నాయి. అయినా ఈసారి ఒక్క చోటా విజయం సాధించలేకపోయింది. కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు సీటు దక్కకపోవడం గట్టి ఎదురుదెబ్బగా మారింది.

...మిగతా 2 లో...

హెచ్-1బీ లక్ష డాలర్ల ఫీజు..

కేసును నిలిపేయాలని కోరిన ట్రంప్ సర్కార్!

- హెచ్-1బీ వీసాలపై లక్ష డాలర్ల ఫీజు వివాదం
- తుది తీర్పు కోసం పట్టుబడుతున్న పిటిషనర్లు, కంపెనీలు

- అప్పీల్స్ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని ప్రభుత్వ వాదన
- ట్రంప్ ప్రభుత్వ నిర్ణయం చట్టవిరుద్ధమని పిటిషన్‌లో ఆరోపణ

అమెరికాలో హెచ్-1బీ వీసా దరఖాస్తులపై ట్రంప్ ప్రభుత్వం విధించిన లక్ష డాలర్ల భారీ రుసుమును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో సమ్మరీ జడ్జిమెంట్ ద్వారా సత్వరమే తుది తీర్పు వెలువరించాలని పిటిషనర్లు కాలిఫోర్నియా ఫెడరల్ కోర్టును కోరారు. అయితే, అప్పీల్ కోర్టు నుంచి నిర్ణయం



వెలువడే వరకు ఈ విచారణను నిలిపివే యాలని ప్రభుత్వం వాదిస్తోంది. ప్రస్తుతం ఈ న్యాయపోరాటం 'గ్లోబల్ నర్స్ ఫోర్స్ వర్సెస్ ట్రంప్' పేరిట కొనసాగుతోంది. అక్టోబర్ 20న కోర్టుకు సమర్పించిన సం యుక్త నివేదికలో, హెచ్-1బీ వీసాల ప్రాసె సింగ్‌కు లక్ష డాలర్లు వసూలు చేయాలన్న నిబంధన చట్టవిరుద్ధమని పిటిషనర్లు వాదించారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాపై

బండి సంజయ్ విమర్శలు...

- కరవు మండలాల జాబితా అశాస్త్రీయమన్న బండి సంజయ్
- కరీంనగర్ పార్లమెంట్ పరిధికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపణ
- 35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలను కూడా విస్మరించారని ఆగ్రహం



తెలంగాణ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కరవు మండలాల జాబితాపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ జాబితా అత్యంత అశాస్త్రీయంగా, పక్షపాత ధోరణితో ఉందని ఆయన ఆరోపించారు. కేవలం మొక్కుబడిగా ఈ జాబితాను తయారు చేశారని మండిపడ్డారు.

...మిగతా 2 లో...

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది: కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం

- మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను దిగ్బంధించారన్న హరీశ్
- కరవుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడం చేతకాని ప్రభుత్వమని విమర్శ
- ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్న

మూసీ నది ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేశారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కు తోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.

...మిగతా 2 లో...



కేటీఆర్ పాస్‌పోర్ట్ వివాదం.. యథాతథ స్థితి కొనసాగించాలన్న హైకోర్టు

- ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు తాత్కాలిక ఊరట
- ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు కోర్టు నోటీసుల జారీ
- కేసు తదుపరి విచారణ నవంబర్ 6కు వాయిదా

ఫార్ములా ఈ రేస్ నిధుల మళ్లింపు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావుకు తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఆయన పాస్ పోర్ట్‌కు సంబంధించి జారీ అయిన నోటీసుల విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని న్యాయ స్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

...మిగతా 2 లో...



ఆ చట్టంతో డిజిటల్ మీడియా స్వేచ్ఛకు ముప్పు లేదు...

- వార్తలు రాసేందుకు వ్యక్తుల అనుమతి, సోర్సుల వెల్లడి అవసరం లేదని వెల్లడి

డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) చట్టం-2023 వల్ల జర్నలిస్టుల స్వేచ్ఛకు ఎలాంటి ముప్పు వాటిల్లదని కేంద్రిని వైష్ణవ్ బుధవారం స్పష్టం చేశారు. మీడియా స్వేచ్ఛా వార్తలు నివే దించే సామర్థ్యాన్ని బలహీనపరిచే నిబంధన ఏదీ ఈ చట్టంలో లేదని ఆయన హామీ ఇచ్చారు. పత్రికా స్వేచ్ఛకు ఈ చట్టం పూర్తి భద్రత కల్పి స్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

...మిగతా 2 లో...



ప్రభుత్వ సేవల్లో ఏఐ

తెలంగాణలో 'ఏఐ సాక్షమ్' కార్యక్రమం ప్రారంభం

- 'ఏఐ సాక్షమ్' కార్యక్రమాన్ని ప్రారంభించిన మల్లు భట్టి విక్రమార్క
- రైతులు, పింఛనుదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలన్న డిప్యూటీ సీఎం
- ప్రజల డేటా భద్రతకే అత్యధిక ప్రాధాన్యమని వెల్లడి



తెలంగాణలో ప్రభుత్వ సేవలను మరింత వేగవంతం, పారదర్శకం చేసే లక్ష్యంతో ప్రభుత్వం 'ఏఐ సాక్షమ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్‌లో ప్రారంభించారు. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం యొక్క ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

...మిగతా 2 లో...

TGTEL/26/A5513 వార్తదీపిక

హెచ్-1బీ లక్ష డాలర్ల ఫీజు..

కేసును నిలిపేయాలని కోరిన ట్రంప్ సర్కార్!

మొదటిపేజీ తరువాయి

మరోవైపు, ఈ కేసులో సెప్టెంబర్ 30న వెలువడిన మధ్యంతర ఉత్తర్వులను సవాలు చేస్తూ అక్టోబర్ 9న తాము నైన్త్ సర్క్యూట్ అప్పీల్ కోర్టును ఆశ్రయించామని ప్రభుత్వం పేర్కొంది. అక్కడ తీర్పు వెలువడకుండా జిల్లా కోర్టులో విచారణను కొనసాగించడం వల్ల ప్రయోజనం ఉండదని స్పష్టం చేసింది. ఈ స్టే పిటిషన్‌పై 2027 జనవరి 14న విచారణ జరగనుంది.ఈ కేసుకు సంబంధించిన పరిపాలనాపరమైన రికార్డులను నవంబర్ 3వ తేదీలోగా తమకు అందజేయాలని పిటిషనర్లు కోరుతున్నారు. ఈ వివాదాస్పద రుసుమును అధ్యక్షుడు ట్రంప్ 2025 సెప్టెంబర్‌లో 'ప్రోక్లమేషన్ 10973' ద్వారా ప్రవేశపెట్టగా, 2026 సెప్టెంబర్‌లో 'ప్రోక్లమేషన్ 11069' ద్వారా దాన్ని పొడిగించారు. అధ్యక్షుడి ఉత్తర్వులు చట్టపరిధిని మించి ఉన్నాయా, ప్రభుత్వ విభాగాలు నిబంధనలను ఉల్లంఘించాయా అనే అంశాలపై న్యాయపోరాటం సాగుతోంది. పిటిషనర్ల తరఫున జస్టిస్ యాక్షన్ సెంటర్, డెమోక్రసీ ఫార్వర్డ్ వంటి సంస్థలు వాదనలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ సేవల్లో ఏఐ

తెలంగాణలో 'ఏఐ సాక్షమ్' కార్యక్రమం ప్రారంభం

మొదటిపేజీ తరువాయి



హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో జరిగిన ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల వేగం పెంచి, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రైతులు, పింఛనుదారులు వంటి వారు పదేపదే ఆఫీసుల చుట్టూ తిరిగే దుస్థితికి చరమగీతం పాడాలన్నారు. ప్రభుత్వ నిధుల వినియోగం, సంక్షేమ పథకాలు అర్హులకు చేరుతున్నాయా లేదా అనే విశ్లేషణ, విద్యుత్ డిమాండ్ అంచనా వంటి పనులకు ఏఐ ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు.అదే సమయంలో ఏఐ వినియోగంలో పలు జాగ్రత్తలు తప్పనిసరి అని భట్టి నొక్కిచెప్పారు. ఏఐ అందించిన సమాచారాన్ని అధికారులు కచ్చితంగా ధ్రువీకరించుకోవాలని సూచించారు. ప్రజల వ్యక్తిగత డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్య మిస్తామని, ఏఐ నిర్ణయాలపై మానవ పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. చిన్నస్థాయి ప్రయోగాలు విజయవంతమైన తర్వాతే ఏఐ వ్యవస్థలను విస్తరించాలని, ఏవైనా లోపాలు జరిగితే బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని అన్నారు. ప్రజలకు అందే వేగవంతమైన, పారదర్శక సేవలే ఏఐ విజయానికి గీటురాయి అవుతాయని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాపై

బండి సంజయ్ విమర్శలు...

మొదటిపేజీ తరువాయి

ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని బండి సంజయ్ అన్నారు. 35 శాతం వర్షపాతం లోటు ఉన్న మండలాలను కూడా జాబితాలో చేర్చకపోవడం ప్రభుత్వ ఉద్దేశాన్ని స్పష్టం చేస్తోందన్నారు. హుస్నాబాద్, వేములవాడ, సిరిసిల్ల, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల్లోని తీవ్ర కరవు పరిస్థితులు ప్రభుత్వానికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. పంట పొలాలు బీళ్లుగా మారినా, ప్రజలు తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.నష్టపరిహారం ఖర్చులు తప్పించుకోవాలనే ఉద్దేశంతోనే కరీంనగర్‌ను ఉద్దేశపూర్వకంగా విస్మరించారా? అని ఆయన నిలదీశారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రైతులతో మాట్లాడితేనే కరవు తీవ్రత స్పష్టంగా తెలుస్తుందని సూచించారు. కరవు మండలాలను ఏ ప్రాతిపదికన, ఏ గణాంకాల ఆధారంగా గుర్తించారో తెలుపుతూ ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రతి మండలానికి వర్షపాతం లోటు, సాగు విస్తీర్ణం, పంట నష్టం, భూమిలో తేమ వంటి అంశాలను విడివిడిగా పరిశీలించి, అర్హులైన అన్ని మండలాలను జాబితాలో చేర్చాలని కోరారు. ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది: కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌లోని వాలంతరిలో మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె కుమారుడు కార్తీక్ రెడ్డిలను పోలీసులు శ్రీనగర్ కాలనీలోని వారి నివాసంలో గృహ నిర్బంధం చేశారు. తెల్లవారుజాము నుంచే వారి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి, బయటకు రాకుండా అడ్డుకున్నారు.ఈ ఘటనపై హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. "కరవుతో రైతులు అల్లాడుతుంటే ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం, రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన పేరుతో కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతోంది" అని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన ముసుగులో జరుగుతున్న దోపిడీ యత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా అరెస్టులను ఖండించారు. ఇది అప్రజాస్వామిక చర్య అని, మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నందుకే తమను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. గృహనిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలని పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

ఆ చట్టంతో డిజిటల్ మీడియా స్వేచ్ఛకు

ముప్పు లేదు...

మొదటిపేజీ తరువాయి

డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ (డీఎన్‌పీఏ) ఈ చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేసిన నేపథ్యంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ చట్టంలో జర్నలిజానికి ప్రత్యేక మినహాయింపులు లేకపోవడం వల్ల వార్తా సేకరణకు ఆటంకం కలుగుతుందని, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్ దెబ్బతింటుందని, పౌరుల సమాచార హక్కు బలహీనపడుతుందని డీఎన్‌పీఏ తన పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పిటిషన్‌పై స్పందించాలని సుప్రీంకోర్టు మంగళవారం కేంద్రాన్ని ఆదేశించింది. మీడియా సంస్థల ఆందోళనలపై స్పందించిన వైష్ణవ్, చట్టం రూపకల్పన ప్రక్రియను వివరించారు. "ప్రైవసీని ప్రాథమిక హక్కుగా గుర్తించిన సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగానే ఈ చట్టాన్ని రూపొందించాం. పత్రికా స్వేచ్ఛను ప్రభావితం చేయాలనే ఉద్దేశం కూడా ప్రభుత్వానికి లేదు. చట్టం రూపకల్పనకు ముందు నెల రోజుల పాటు విస్తృతమైన ప్రజా సంప్రదింపులు జరిపాం. ఇందులో పరిశ్రమ వర్గాలు కూడా పాలుపంచుకున్నాయి. చట్టంలో ఎక్కడా జర్నలిస్టుల స్వేచ్ఛకు భంగం కలిగించే అంశం లేదు" అని ఆయన తెలిపారు.మీడియా సంస్థల ఆందోళనలను తోసిపుచ్చుతూ.. వార్తా కథనానికి సంబంధించిన వ్యక్తి నుంచి రిపోర్టర్ ముందస్తు అనుమతి తీసుకోవాలని చెప్పే నిబంధన ఏదీ ఈ చట్టంలో లేదని మంత్రి స్పష్టం చేశారు. అదేవిధంగా, కథనానికి సంబంధించిన వార్తా మూలాలను (సోర్స్) వెల్లడించాలని బలవంతం చేసే క్లాజ్ కూడా ఇందులో లేదని ఆయన క్లారిటీ ఇచ్చారు.ఆగస్టు 2023లో పార్లమెంట్ ఆమోదించిన డీపీడీపీ చట్టం, డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణకు సంబంధించి భారతదేశంలోనే మొట్టమొదటి సమగ్ర చట్టం. వ్యక్తుల సమ్మతితో లేదా చట్టంలోని సెక్షన్ 7లో పేర్కొన్న కొన్ని 'చట్టబద్ధమైన ఉపయోగాలు' కింద వ్యక్తిగత డేటాను ప్రాసెస్ చేయడానికి ఇది అనుమతిస్తుంది. ప్రస్తుతం ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలో ఉండగా, కేంద్రం తన స్పందనను తెలియజేయాల్సి ఉంది.

బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు.. కాంగ్రెస్ ఖాతా తెరిచిందా?:

మోదీ సెటైర్...

మొదటిపేజీ తరువాయి

ఈ ఫలితాలను ప్రస్తావిస్తూ మోదీ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఓటింగ్ యంత్రాల్లో అక్రమాలు జరుగుతు న్నాయంటూ కాంగ్రెస్ గతంలో ఆరోపణలు చేసింది. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని కూడా కోరింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతోనే జరిగాయని మోదీ గుర్తుచేశారు. అయినా కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదంటూ పరోక్షంగా ఎద్దేవా చేశారు.

టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు

మొదటిపేజీ తరువాయి

టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ పునర్‌నియామకాన్ని టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా సవాలు చేశారు. సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు తీర్మానం చెల్లదని, నియామక ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని ఆయన అక్టోబర్ 26న రాసిన లేఖలో ఆరోపించారు. ఈ వివాదం కార్పొరేట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, రాహుల్ ఆరోపణలపై బీజేపీ నేత సీఆర్ కేశవన్ స్పందించారు. రాహుల్ గాంధీకి ఆర్థికశాస్త్రంపై అవగాహన లేదని విమర్శించారు.

తుపాను బాధితులకు భారీ ప్యాకేజీ ప్రకటించిన చంద్రబాబు.. ఎవరికి ఎంత.. పూర్తి వివరాలు ఇవిగో!

అర్నబ్ తుపాను బాధితుల కోసం ఏపీ ప్రభుత్వం భారీ పరిహార ప్యాకేజీ


మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు, ఇళ్ల నష్టానికి ఆర్థిక సాయం

వ్యవసాయ, ఉద్యాన పంటలకు హెక్టారుకు రూ. 35,000 వరకు పరిహారం

తుపాను నష్టంపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక, కేంద్ర బృందాన్ని కోరిన సీఎం

ప్రతీ బాధితుడికి పారదర్శకంగా సాయం అందిస్తామని చంద్రబాబు హామీ

అర్నబ్ తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని, నష్టపోయిన చివరి వ్యక్తికి కూడా న్యాయం జరిగేలా చూస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. తుపాను అనంతర సహాయక చర్యలు, నష్టపరిహారంపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తుపాను బాధితుల కోసం ప్రభుత్వం భారీ ప్యాకేజీని ప్రకటించింది. ఇళ్లు, పంటలు, పశువులు, వ్యాపారాలు నష్టపోయిన వారికి పూర్తిస్థాయిలో అండగా నిలుస్తామని, వీలైనంత వేగంగా పరిహారం అందించి వారిని తిరిగి నిలబెడతామని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం ప్యాకేజీ పారదర్శకంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సాయం అందుతుందని సీఎం తెలిపారు. తక్షణ సహాయం కింద తుపాను ప్రభావిత కుటుంబాలకు నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందించనున్నట్లు వెల్లడించారు. తక్షణ సహాయం మరియు ఇళ్ల నష్టపరిహారం తుపాను కారణంగా ఇళ్లలోకి నీరు చేరిన ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం. మత్స్యకారులు మరియు చేనేత కార్మికులకు 50 కేజీల బియ్యం. ప్రతి కుటుంబానికి కేజీ కందిపప్పు, లీటర్ పామాయిల్, కేజీ ఉల్లిపాయలు, కేజీ చక్కెర, కేజీ బంగాళదుంపలు ఉచితంగా పంపిణీ. తక్షణ ఖర్చుల కోసం ఒక్కో కుటుంబానికి రూ. 1000 నుంచి గరిష్టంగా రూ. 3000 వరకు ఆర్థిక సహాయం. తుపాను కారణంగా మరణించిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా. పాక్షికంగా ఇల్లు దెబ్బతింటే రూ. 10,000 ఆర్థిక సహాయం. వ్యాపారాలు, జీవనోపాధికి చేయూత చిన్న కిరాణా షాపులు, రెస్టారెంట్లు, సర్వీస్ షాపులకు రూ. 25,000. చేతివృత్తుల వారికి జీవనోపాధి నష్టానికి రూ. 25,000. తోపుడు బండ్లకు రూ. 20,000. ఎంఎస్ఎంఈ పరిశ్రమలు (రూ. 40 లక్షల టర్నోవర్ వరకు): రూ. 50,000. పరిశ్రమలు (రూ. 40 లక్షల నుంచి రూ. 1.5 కోట్ల టర్నోవర్): రూ. 1 లక్ష. పరిశ్రమలు (రూ. 1.5 కోట్ల టర్నోవర్ పైబడినవి): రూ. 1,50,000. దెబ్బతిన్న ద్విచక్ర వాహనానికి రూ. 3000 దెబ్బతిన్న ఆటోకు రూ. 10,000. మత్స్యకారులకు నష్టపరిహారం వలలు పాక్షికంగా దెబ్బతింటే మరమ్మతులకు రూ. 5000, రీప్లేస్‌మెంట్‌కు రూ. 10,000. మెకనైజ్డ్ కాని బోటు, వలలు పూర్తిగా దెబ్బతింటే రూ. 20,000. మెకనైజ్డ్ బోటు, వలలు పూర్తిగా దెబ్బతింటే రూ. 25,000. చేపల చెరువుల పునరుద్ధరణకు రూ. 18,000. పశు నష్టపరిహారం ఆవు/గేదె మరణిస్తే: రూ. 50,000 దూడలకు: రూ. 25,000 గొర్రె/మేక: రూ. 7,500 కోడికి రూ. 100 (ఒక లబ్ధిదారునికి గరిష్ఠంగా రూ. 10,000). పశువుల షెడ్ దెబ్బతింటే: రూ. 5,000. వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టపరిహారం (హెక్టారుకు) రూ. 75,000: తమలపాకు రూ. 35,000: అరటి, పసుపు, యమ్, మిరప, జామ, బొప్పాయి, మామిడి, కాఫీ, యాపిల్ బేర్, సపోటా, కాజు, డ్రాగన్ ఫ్రూట్. రూ. 25,000: పత్తి, వేరుశనగ, వరి, కూరగాయలు, టమాటో, పూలు, ఉల్లి, పుచ్చ, నర్సరీ, దానిమ్మ, కొత్తిమీర. రూ. 25,000: చెరకు (మొదటి పంట) రూ. 15,000: సజ్జ, మినుములు, పెసలు, మొక్కజొన్న, రాగి, కంది, నువ్వులు, సోయాబీన్, పొద్దుతిరుగుడు, పొగాకు, జనుము, కొర్ర, సామ. ఆయిల్ పామ్, కొబ్బరి: ఒక్కో చెట్టుకు రూ. 1500 యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "నా మొదటి ప్రాధాన్యత ప్రాణనష్టాన్ని నివారించడం. అయినప్పటికీ ఐదుగురు మరణించడం బాధాకరం. వారి



కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి" అని అన్నారు. మూడు రోజుల్లో ఎనిమిది సార్లు సమీక్షలు నిర్వహించి, టెక్నాలజీని వాడుకుని అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేయడం వల్లే నష్టాన్ని తగ్గించగలిగామని తెలిపారు. తుపాను తీరం దాటిన అయిన వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభించామన్నారు. రెండు, మూడు రోజుల్లో కోనసీమ, పశ్చిమ గోదావరి మినహా అన్ని జిల్లాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు. రోడ్లపై పడిన చెట్లను తొలగించి రవాణాకు అంతరాయం లేకుండా చేశామని, తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు. తుపాను నష్టంపై ప్రాథమిక నివేదికను కేంద్రానికి పంపి, కేంద్ర బృందాన్ని పంపమని కోరినట్లు తెలిపారు. రేపు, ఎల్లుండి క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించి, బాధితులకు భరోసా కల్పిస్తానని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బాధ్యత గల ప్రభుత్వంగా ప్రజల కష్టాల్లో సర్వశక్తులు ఒడ్డి అండగా నిలుస్తామని ఆయన హామీ ఇచ్చారు.

తుపాను వేళ ఏపీకి అండగా తెలంగాణ ప్రభుత్వం.. సాయానికి సిద్ధమన్న భట్టి

మొదటిపేజీ తరువాయి

ఈ కష్టకాలంలో ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం అవసరమైతే సిబ్బందిని, అవసరమైన సామగ్రిని పంపడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ హామీతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు మరింత వేగవంతం అవుతాయని భావిస్తున్నారు.తెలంగాణ ప్రభుత్వం అందించిన సహాయ హస్తానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో అండగా నిలుస్తామన్న భట్టి విక్రమార్కకు, తెలంగాణ ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఈ సహకారం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అంతకుముందు, తుపాను సహాయక చర్యల కోసం ఏపీ ప్రభుత్వం ఇప్పటికే సుమారు 6,000 మంది అనుభవజ్ఞులైన సిబ్బందిని రంగంలోకి దించినట్లు గొట్టిపాటి తెలిపారు. తుఫాను పునరుద్ధరణ పనుల్లో అనుభవం ఉన్న అధికారులు, ఫీల్డ్ సిబ్బందిని అత్యవసర సేవల కోసం సిద్ధం చేశామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో డైరెక్టర్ల స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆయన వివరించారు.

కేటీఆర్ పాస్‌పోర్ట్ వివాదం.. యథాతథ స్థితి కొనసాగించాలన్న హైకోర్టు

మొదటిపేజీ తరువాయి

ఫార్ములా ఈ కేసులో విచారణ జరుపుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి (ఆర్‌పీవో) లేఖ రాసింది. ఏసీబీ అభ్యర్థన మేరకు పాస్‌పోర్ట్ అధికారులు కేటీఆర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులను సవాలు చేస్తూ కేటీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, పాస్‌పోర్ట్ నోటీసుల ప్రక్రియలో యథాతథ స్థితిని పాటించాలని ఆదేశించింది. ప్రతివాదులుగా ఉన్న ఏసీబీ, పాస్‌పోర్ట్ అధికారులకు నోటీసులు జారీ చేస్తూ, వారి వాదనలను కౌంటర్ అఫిడవిట్ రూపంలో సమర్పించాలని సూచించింది. అనంతరం, కేసు తదుపరి విచారణను నవంబర్ 6వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకునే ప్రక్రియకు ప్రస్తుతానికి అడ్డుకట్ట పడినట్లయింది.



TGTEL/26/A5513 వార్త దీపిక

రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలి





ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి, అక్టోబర్ 28, వార్త దీపిక న్యూస్:

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసి, వారికి న్యాయంగా దక్కాల్సిన మద్దతు ధర అందించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులను కోరారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగకుండా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం మారేపల్లి, తొగర్‌పల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. తరువాత సంగారెడ్డి మండలం హనుమాన్ నగర్ లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ధాన్యం సేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిం చాలని అన్నారు.రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, తేమ శాతం నిర్ధారణ, గన్నీ సంచుల సరఫరా, ధాన్యం రవాణా, టార్పాలిన్ల వంటి అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన మేరకు రైతులకు ఆ ప్రయోజనం అందించాలని చింత ప్రభాకర్ డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడం వారి హక్కు అని, కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన నగదును రైతుల ఖాతాల్లో సకాలంలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవించే రైతు కుటుంబాలకు పంట విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం ఎంతో కీలకమని, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరిగితే వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని అన్నారు. ధాన్యం సేకరణ నుంచి చెల్లింపుల వరకు ప్రతి దశను సమర్థంగా నిర్వహించి, రైతులకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మాజీ డీసీఎంఎస్ వైస్ పట్నం మాణిక్యం , పీఏసీఎస్ చైర్మన్లు ఆకుల పవన్, మున్నూరు రాజు, యాదగిరి, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, మండల పార్టీ అధ్యక్షుడు మ్యాకం విట్టల్, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, సర్పంచులు రామాగౌడ్, మహేష్, అనిల్, డి.కృష్ణ, పాండురంగం, దేవేందర్, అమరేందర్ రెడ్డి, సాయన్న, మాజీ జెడ్పీటీసీ ప్రేమానందం, రామచంద్రయ్య, ఉక్ముద్దీన్, రవి, బుచ్చయ్య, నరేందర్ రెడ్డి, జగదీశ్వర్, మోహన్ గౌడ్, శేఖర్, కృష్ణారెడ్డి, ఆంజనేయులు గౌడ్, సంషోద్దీన్, ప్రభాకర్ గౌడ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై వ్యతిరేకంగా అవగాహన.. ర్యాలీ..!

సంగారెడ్డి, అక్టోబర్ 28, వార్త దీపిక న్యూస్ :

యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జిల్లా శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, వాలంటీర్లు కలిసి మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, కుటుంబాలపై పడే ప్రభావం, యువత భవిష్యత్తుపై కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ వనజ రెడ్డి, జిల్లా వైస్ చైర్మన్ చందర్, జిల్లా కోశాధికారి డాక్టర్ ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆకాశ ప్రీతం, జెఆర్సి, పిఆర్సి కోఆర్డినేటర్ లింగాగౌడ్, మేనేజింగ్ కమిటీ సభ్యులు, వాలంటీర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. గాయత్రి స్కూల్, భారతీయ విద్యా మందిర్ స్కూల్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిసలు కాకుండా తమ ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై దృష్టి సారించాలని సందేశాన్ని ఇచ్చారు. మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యువత, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.“మత్తు పదార్థాలకు దూరంగా ఉందాం -- ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం” అనే నినాదంతో నిర్వహించిన ఈ ర్యాలీ ద్వారా మత్తు పదార్థాల రహిత భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని సందేశాన్ని వ్యాప్తి చేశారు.


పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి..!

బీజేపీ మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్

మహిళా పారిశుద్ధ్య కార్మికులకు ఆర్థిక సహాయం

పటాన్ చెరు, అక్టోబర్ 28, వార్త దీపిక న్యూస్ :

నియోజకవర్గంలోని అమీన్‌పూర్ మండలం, బిరంగూడ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న సీఎంసీ అమీన్‌పూర్ మున్సిపాలిటీ మహిళా పారిశుద్ధ్య కార్మికులు దసరా పండుగ సందర్భంగా భారతీయ జనతా పార్టీ బిరంగూడ డివిజన్ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ ను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన అనంతరం మహిళా పారిశుద్ధ్య కార్మికులకు తన వంతు సహాయంగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులంటే తనకు ఎంతో గౌరవమని, వారు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 5 గంటల నుంచే విధులకు హాజరై వీధులు, కాలనీలు, పరిసర ప్రాంతాలను శుభ్రపరుస్తూ ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు లేకపోతే మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం సాధ్యం కాదని, వారి కష్టాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరినీ గౌరవించాలని, ముఖ్యంగా ప్రజల ఆరోగ్యం కోసం కష్టపడే క్షేత్రస్థాయి కార్మికులను చిన్నచూపు చూడకుండా ఆత్మీయంగా ఆదరించాలని పిలుపునిచ్చారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్టీ అగ్రనాయకత్వం ప్రజాసేవకు, సమాజంలోని ప్రతి వర్గాన్ని గౌరవించడానికి ఎప్పటి కప్పుడు స్ఫూర్తినిస్తూ మార్గనిర్దేశం చేస్తున్నారని ఈర్ల రాజు ముదిరాజ్ తెలిపారు. వారి స్ఫూర్తితోనే సమాజానికి సేవలందించే కార్మికులను గౌరవిస్తూ, తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 17న ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని, బిరంగూడ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయమ్మలకు వస్త్రాలు అందజేశారు. దసరా పండుగ సందర్భంగా తనను కలిసిన మహిళా పారిశుద్ధ్య కార్మికులను ఆత్మీయంగా పలకరించి, వారి సేవలను అభినందించిన ఈర్ల రాజు ముదిరాజ్, వారి కుటుంబాలకు తన వంతుగా ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే కార్మికులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, వారి కష్టాన్ని గుర్తించి వారికి అండగా నిలవాలని అన్నారు.



నిరుద్యోగ యువత ఆశలకు అండగా మనోహర్ రెడ్డి ఫౌండేషన్

తాండూర్, అక్టోబర్ 28, వార్త దీపిక న్యూస్ :

నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో అండగా నిలుస్తున్న బి.ఎం.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాండూర్లో పోటీపరీక్షల అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. బుధవారం పట్టణంలోని విలియంమున్ స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధమవుతున్న దాదాపు 250 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ స్నేహ మిశ్రా లతో కలిసి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిలు మాట్లాడుతూ నిరుద్యోగ యువత కోసం ఉచిత కోచింగ్ తో పాటు స్టడీ మెటీరియల్ అందించడం సంతోషకరమన్నారు. 2018లో పరిగి లో నిరుద్యోగ యువత కోసం ఉచిత కోచింగ్ ఏర్పాటు చేశారని 2022లో 60 జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గైడ్స్ పంపిణీ చేశారని గుర్తు చేశారు. పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలుస్తున్నాడని కొనియాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నవంబర్ 29 ఎస్సై, డిసెంబర్ 20 కానిస్టేబుల్ పరీక్ష వరకు ఉద్యోగం కు మాత్రమే ప్రయత్నించాలి. దీన్ని ఉచిత కోచింగ్ అనొద్దు. మీ ఫీజు నేను కడుతున్న డబ్బులు కట్టి చదువుతున్నట్లు పట్టుదలతో చదవాలన్నారు ఆర్థిక పరిస్థితి భవిష్యత్తును నిర్ణయించకూడదు, కృషి నిర్ణయించాలన్నారు. యూనిఫామ్ అంటే గౌరవం మాత్రమే కాదు బాధ్యతా అని మంచి పౌరుడుగా ఎదగాలి అన్నారు,ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు క్లాసులు ఉంటాయని మొబైల్ ఫోన్ సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఆరు నెలలు కష్టపడి తే జీవితం బాగుపడుతుందని ప్రిలిమ్స్ లో క్వాలిఫై అయినవారికి ఫిజికల్ ఫైనల్స్ పరీక్ష కు కూడా కోచింగ్ ఇప్పిస్తామన్నారు.



ఓట్లు పోయాయని గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్.. ఆధారాలు చూపించండి

అవినీతి, కుట్ర రాజకీయాలకు కాంగ్రెస్ కేరాఫ్ అడ్రస్

అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ రాజకీయాలు..తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం

ఈవీఎంలను తెచ్చిందే కాంగ్రెస్ పార్టీ .. అదే ఈవీఎంల ద్వారా రెండుసార్లు అధికారంలోకి వచ్చి ఇప్పుడు ఈవీఎంలపై బురద చల్లుతారా

సీఎం సొంత ఊరుకొండారెడ్డిపల్లికి వెళ్దాం.. ఎవరి ఓటు పోయిందో చూద్దాం

ఫామ్-6 నింపడం చేతకాదు... ధర్నాలు చేస్తారు ..ఎస్.ఐ.ఆర్ అంటే రాజ్యాంగ హక్కు

సింగూరు జలాలు సంగారెడ్డి ప్రాంత ప్రజల హక్కు

మెదక్ ఎంపీ రఘునందన్ రావు

సంగారెడ్డి, అక్టోబర్ 28, వార్త దీపిక న్యూస్ :

కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పునాదులపై ఎదగాలని చూస్తోందని, తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ తెలంగాణలో, సంగారెడ్డిలో కాంగ్రెస్ నాయకులు ఎందుకు ధర్నాలు చేస్తున్నారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డిలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఓటర్ల జాబితా సవరణ రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని రఘునందన్ రావు పేర్కొన్నారు. కొత్త ఓటర్ల పేర్లను చేర్చడం, మరణించిన వారి పేర్లను తొలగించడం, ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓట్లు కలిగి ఉన్నవారిని గుర్తించడం వంటి అంశాల కోసం ఈ ప్రక్రియ చేపడతారని వివరించారు. పదేళ్లకోసారి ఓటర్ల జాబితాను సవరించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.ఓట్లు తొలగిపోయాయని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు, అసలు ఎంతమంది ఓట్లు కోల్పోయారో వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎవరికైనా ఓటు హక్కు తొలగిపోతే ఫారం-6 నింపి సంబంధిత అధికారులకు సమర్పించడం ద్వారా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దీనిపై పెద్దఎత్తున ఆందోళనలు చేయడం ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణ ముఖ్యమంత్రి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లికి వెళ్లి, పోలీసుల సమక్షంలో ప్రతి ఇంటిలో ఓటు హక్కు కోల్పోయినవారి వివరాలను పరిశీలించేందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు.ప్రభుత్వ అధికారులే బూత్ స్థాయి అధికారులుగా (బీఎల్‌వోలుగా) వ్యవహరిస్తున్నారని, వారు ఏదైనా రాజకీయ పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు నిరూపించగలరా అని ప్రశ్నించారు. జహీరాబాద్ ఎంపీ కుటుంబానికి చెందిన వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నాయని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఎన్నికల్లో గెలవలేక, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్న ఆదరణను ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు ఓటు చోరీ అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.గతంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వాలు కూడా ఈవీఎంల ద్వారానే ఎన్నికల్లో విజయం సాధించాయని గుర్తుచేశారు. ఇప్పుడు అదే ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. ఓటు హక్కు కోల్పోయినట్లు చెబుతున్న 10 వేల మందిని తీసుకొని ఢిల్లీకి వెళ్లాలని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. ఓటర్ల జాబితా సవరణపై ప్రజల్లో అనవసర భయాలు సృష్టించవద్దని సూచించారు.

సింగూరు జలాలపై కాంగ్రెస్ వైఖరేంటి..

సింగూరు జలాలను హైదరాబాద్‌కు కేటాయించడంలో తప్పేముందని ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ నాయకులు, తమకు ఓటేసి గెలిపించిన ప్రజల పట్ల ప్రేమ ఉంటే సంగారెడ్డి ప్రాంత ప్రజల నీటి అవసరాలను ఎందుకు పట్టించుకోవడం లేదని రఘునందన్ రావు నిలదీశారు. హైదరాబాద్‌కు వివిధ మార్గాల ద్వారా నీటిని సరఫరా చేసే అవకాశాలు ఉన్నాయని, సంగారెడ్డి ప్రాంత ప్రజలకు సింగూరు జలాలే ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. సింగూరు నీటిని దిగువకు ఎందుకు విడుదల చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఆధారాలు లేని ఆరోపణలు, తప్పుదు ప్రచారాల కారణంగానే కాంగ్రెస్ పార్టీ గతంలో పలుమార్లు అధికారానికి దూరమైందని, మరోసారి కూడా తన స్వయంకృతాపరాధాల వల్లే ప్రజల మద్దతు కోల్పోయే పరిస్థితి వస్తుందని రఘునందన్ రావు వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప నాయకులు మాణిక్యరావు, కసినివాసు ,దోమల విజయ్ ,మందుల నాగరాజు ,నరేన్ దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.





ఆస్ట్రేలియాకు తాండూర్ కందుల ఎగుమతి

తాండూర్, అక్టోబర్ 28, వార్త దీపిక న్యూస్ :

జియలాజికల్ ఐడెంటిఫికేషన్ ట్యాగ్ గుర్తింపు పొందిన తాండూర్ కందులు తొలిసారిగా ఆస్ట్రేలియాకు ఎగుమతి అవుతున్నాయి అపేడా సహాయంతో హైదరాబాద్ కు చెందిన దుర్గా ఎక్స్పోర్ట్స్ అండ్ ఇన్ స్పోర్ట్స్ సంస్థ “అమ్మాస్” బ్రాండ్ పేరుతో 2.5 మెట్రిక్ టన్నుల కందులను సముద్ర మార్గంలో పంపిస్తోంది. బుధవారం హైదరాబాదు నుంచి తొలి సరుకును వర్చువల్ విధానంలో ప్రారంభించారు. తాండూర్, పెద్దేముల్, బషీరాబాద్ మండలంలోని వర్షాధార భూముల్లో కందులను సాగు చేస్తున్నారు.



TGTEL/26/A5513
వార్త దీపిక

తాండూర్ లో వీధి కుక్కల పట్టివేత

తాండూర్, అక్టోబర్ 28, వార్త దీపిక న్యూస్ :

పట్టణంలోని వీధి కుక్కల సమస్యను నియంత్రించడం ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ తాండూర్ మున్సిపల్ పరిధిలో వీధి కుక్కలను పట్టివేత కార్యక్రమాన్ని చేపట్టారు.

బ్లూ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో సాయిపూర్, మాణిక్ నగర్, పాత కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టుకున్న కుక్కలను జంతువు జనన నియంత్రణ చికిత్స ఏబిసి నిర్వహించి ఐదు రోజులపాటు పరిశీలనలో ఉంచుతారు. ఆరో రోజు వాటిని ఏ ప్రాంతంలో పట్టుకున్నారో తిరిగి అదే ప్రాంతంలో వదలి పెడతారు. ఈ ప్రాంతాల్లో ఇదేవిధంగా కుక్కల పట్టివేత శాస్త్ర చికిత్స పరిశీలన ప్రక్రియ కొనసాగిస్తారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ నిరజబాల్ రెడ్డి మాట్లాడుతూ వీధి కుక్కల జనాన్ని నియంత్రణతో పాటు పట్టణ ప్రజలకు సురక్షితమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు ఈ క్రమంలో మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డి, బ్లూ క్రాస్ ప్రతినిధి వార్డు కౌన్సిలర్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ఎస్సై వార్డ్ జవాన్లు పాల్గొన్నారు.



కరువు మండలాలుగా ప్రకటించాలి..!!

తాండూర్, అక్టోబర్ 28, వార్త దీపిక న్యూస్ :

నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితి నెలకొన్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. పెద్దముల్, యాలాల్, బషీరాబాద్, తాండూర్ మండలాలను తీవ్ర కరువు ప్రాంతాలుగా గుర్తించినట్లు వెల్లడించింది. కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఎలాంటి సహాయక చర్యలు చేపడుతారనే దానిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రైతులకు పెట్టుబడి సహాయం తాగునీరు సరఫరా పశుగ్రాసం ఉపాధి అవకాశాల కల్పన వంటి చర్యలు చేపట్టాల్సి ఉంది.



బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ఎన్ఎంఆర్ లక్ష్యం..!

అన్నా అంటే నేనున్నాంటు సేవ కార్యక్రమాలు

ఎన్ఎంఆర్ డివిజన్ ఇంచార్జీ రవి ముదిరాజ్

జహీరాబాద్, అక్టోబర్ 28, వార్త దీపిక న్యూస్ :



అన్నా అంటే నేనున్నానంటూ ప్రజల అభివృద్ధే లక్ష్యంగా పలు సేవ కార్యక్రమాలు, పేదలకు నేనున్నానని ధైర్యం చెబుతూ ఎన్ఎంఆర్ యువసేన కార్యక్రమాలు చేపడుతుందని ఎన్ఎంఆర్ జహీరాబాద్ డివిజన్ ఇంచార్జీ బొయిని రవి ముదిరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా మెదక్ పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ నీలం మధు ఆధ్వర్యంలో ఎన్ ఎంఆర్ యువసేన పలు సామాజిక కార్యక్రమాలు చేస్తూ పేదలకు అన్న అంటే నేనున్నాంటూ ముందుకేళ్తున్నామని పేర్కొన్నారు. పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా, సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, పేదలకు రేషన్ కార్డులు, 200ల యూనిట్లు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వ్యవసాయానికి సబ్సిడీ డ్రీప్, ఇందిరమ్మ ఇండ్లు తదితర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకేల్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న నీలం మధు ముదిరాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని రవి ముదిరాజ్ తెలిపారు.

రక్తదానం మహాధానం..!

సదాశివపేట, అక్టోబర్ 28, వార్త దీపిక న్యూస్ :

ఆపదలో ఉన్న వారికి ఆదుకోవడం మనిషి లకిస్యమని కాంగ్రెస్ పార్టీ సేవదళ్ జిల్లా అధ్యక్షుడు సందీప్, ఉపాధ్యక్షులు నర్సింలు అన్నారు. బుధవారం సదాశివపేట పట్టణ పరిధిలోని సిద్దాపూర్ కాలనీ వద్ద స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా రక్త ధాన శిభిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిభిరంలో జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ సేవదళ్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సేవదళ్ జిల్లా అధ్యక్షులు సందీప్ మాట్లాడుతూ రక్తదానం చేయడం మరొకరికి ప్రాణందానం చేసి ఒకరికి జీవితం కాపాడినట్లు అని, మనిషి అన్ని ధానాలకంటే రక్తదానం మహా గొప్పదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సేవదళ్ సదాశివపేట మండల అధ్యక్షులు నర్సింలు, జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ సేవదళ్ అధ్యక్షులు బీరప్ప, ఉపాధ్యక్షులు ప్రవీణ్, ఝరాసంగం మండల కాంగ్రెస్ పార్టీ సేవదళ్ అధ్యక్షులు లక్ష్మణ్, ఎల్లోయి రాజు, మొగుడంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పవన్ రాథోడ్, శంకర్ గౌడ్, కోహిర్ మండల కాంగ్రెస్ పార్టీ సేవదళ్ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





మహనీయుల ఆశయాలను నిజం చేయాలి

డీసీసీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి

మహర్షి వాల్మీకి బోధనలు సమాజానికి మార్గదర్శకం

ధర్మం, సత్యం, న్యాయం, మహర్షి వాల్మీకి జీవితం

మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్-చార్జి నీలం మధు ముదిరాజ్

నారాయణఖేడ్, అక్టోబర్ 28, వార్త దీపిక న్యూస్ :

వాల్మీకి మహర్షి ఆశయాలు, బోధనలు సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని డీసీసీ అధ్యక్షులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్-చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. మహనీయుల జీవిత చరిత్రలను యువతకు పరిచయం చేస్తూ, వారు చూపిన మార్గంలో నడిచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కంగ్టి మండల పరిధిలోని చాప్టా (కె) గ్రామంలో బుధవారం నిర్వహించిన వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్లోల చంద్రశేఖర్ రెడ్డి, నీలం మధు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జీవితం, ఆయన రచించిన రామాయణం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువల ప్రాధాన్యాన్ని వాల్మీకి మహర్షి జీవితం చాటిచెబుతుందని నీలం మధు అన్నారు. సమాజంలో ఐకమత్యాన్ని పెంపొందిస్తూ, మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టినప్పుడే వారి సేవలకు నిజమైన గౌరవం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ద్వారా యువతలో స్ఫూర్తి, సామాజిక బాధ్యత పెంపొందుతాయని తెలిపారు. విగ్రహావిష్కరణలు కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, మహనీయులు చూపిన మార్గంలో నడిచేందుకు ప్రేరణ కలిగించాలని ఆయన సూచించారు. విద్య, సామాజిక అభివృద్ధి, సమానత్వానికి ప్రాధాన్యమిస్తూ అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్వేశ్వర అంబికా శివయోగి మహారాజ్, గుండు లక్ష్మణ్ స్టేట్ పి ఆర్ టి యు మాజీ అధ్యక్షులు, గుండు మోహన్, మాజీ జెడ్పీటీసీ, సత్యనారాయణ, మాజీ ఎంపీపీ, కౌన్సిలర్లు బాణపురం రాజు, రామకృష్ణ, సర్పంచులు శివాజి పటేల్, వెంకన్న, కృష్ణ, భూమన్న, దిశ కమిటీ సభ్యులు ప్రకాష్ రాథోడ్, ముదిరాజ్ తాలూకా సంగం అధ్యక్షులు శంకర్, మాజీ ఎంపీటీసీ సాయిలు పటేల్, పున్నయ్య, వెంకటేష్, భూమయ్య, సాయిలు నాయకులు, వెంకట రాములు, రవి, వెంకన్న, ముచందర్, కర్ణం శ్రీను, మాణిక్ పాటిల్, మనోహర్, వీరేశం, మారుతీ రావ్, నావనాథ్, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, వాల్మీకి సంఘం నాయకులు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గంగ కత్వ కాలువకు రూ.37 కోట్లు





సదాశివపేట అక్టోబర్ 28, వార్త దీపిక న్యూస్ :

గంగకత్వ ప్రాజెక్టు, కాలువ ఆధునీకరణకు రూ.37 కోట్లతో గంగ కత్వ ప్రాజెక్ట్ ను పరిశీలించారు. మండలం సూరారం గ్రామంలోని గంగకత్వ ప్రాజెక్టును పరిశీలించిన ఆయన, సాగునీటి శాఖ అధికారులు, ఆయకట్టు గ్రామాల రైతులు, స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ గంగకత్వ కాలువ పరిధిలోని 11 గ్రామాల్లో 3,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. సదాశివపేట మండలంలో సుమారు 16 కిలోమీటర్ల మేర విస్తరించిన కాలువకు 28 చెరువులు అనుసంధానమై ఉన్నాయని చెప్పారు. కాలువను ఆధునీకరించి, చివరి ఆయకట్టు వరకు నీరందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించానని తెలిపారు. రూ.37 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా లేకపోయినా రైతుల ప్రయోజనాల కోసం నిధులు తీసుకువచ్చానన్నారు. ఏడో నిజాం కాలంలో నిర్మించిన కాలువను తిరిగి ఆధునీకరించే అవకాశం రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాలని, కాంట్రాక్టర్ల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వొద్దని అధికారులకు సూచించారు.

నవంబర్ లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహా, వివేక్ ల చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన

2028 జూన్ నెలలో సీఎం రేవంత్ రెడ్డి తో ప్రారంభం

11 గ్రామాలకు 3,300 ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం

రైతుల అవసరాలే లక్ష్యంగా పనులు చేపడుదాం..!

గంగ కత్వ కాలువ పరిశీలన డ్రైవ్ చేసి ఈత కొట్టిన జగ్గారెడ్డి

వాగుపై ఏడు చెక్‌డ్యామ్‌లకు ప్రతిపాదనలు

గంగకత్వ ఆధునీకరణకు అదనంగా వాగుపై ఏడు చోట్ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని జగ్గారెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి ప్రాంతం నుంచి గంగకత్వకు వచ్చే వాగును అభివృద్ధి చేస్తే నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాగు, ప్రాజెక్టులో పూడిక తొలగింపునకు ప్రతిపాదనలు రూపొందించి చాలని సూచించారు. ప్రాజెక్టులో ఆరు నుంచి ఏడు అడుగుల మేర పూడిక తొలగించే అవకాశం ఉందని అధికారులు తెలపగా, సాంకేతికంగా ఎంతవరకు సాధ్యమో పరిశీలించాలని కోరారు. కొల్చారం- నిజాంపూర్ మధ్య మంజీరా బ్యాక్‌వాటర్ తో పంటలు మునుగుతున్నాయని రైతులు తెలిపారు. అక్కడ చెక్‌డ్యామ్ నిర్మించాలని కోరగా, సాధ్యాసాధ్యాలను పరిశీలించి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

2028 నాటికి పనుల పూర్తికి ప్రణాళిక

దీపావళి తర్వాత శంకుస్థాపన జరిగేలా చూస్తామని జగ్గారెడ్డి తెలిపారు. డిసెంబర్‌లోపు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. 2028 నాటికి పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, పనులు పూర్తయ్యాక ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. డిసెంబర్‌లో మరోసారి ప్రాజెక్టును సందర్శించి పనుల పురోగతిని సమీక్షిస్తానని తెలిపారు. నిధులు, పనుల మంజూరు కోసం కృషి చేయడమే తన బాధ్యతని, శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలను అధికారులు ప్రోటోకాల్ ప్రకారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి ఈ వాగుతో తనకు అనుబంధం ఉందని, తన భార్య స్వగ్రామం తాటిపల్లి కావడంతో తరచూ ఇక్కడికి వచ్చేవాడినని గుర్తుచేసుకున్నారు. పర్యటన సందర్భంగా గంగకత్వ కాలువలో జగ్గారెడ్డి ఈత కొట్టారు.

వాల్మీకి మహర్షి విగ్రహం ఆవిష్కరణ









Printed, published & Owned by erlla pavan kumar, printed at Saketh Publications, #sy. No-312, Trinetra comples Sangareddy, Telangana -502001.Editor erlla pavan kumar, Rni Regn. No.TG TEL/26/A5513.Email:pavanerla@gmail.como.offic:4-7-25b/h.balajinagar sangareddy :cell:9666466984